సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 10 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 52.675 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 52.675 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 30, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.92,500
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.8,366
3 శాతం జీఎస్టీతో	రూ.8,617
నవర (8 గ్రా)	రూ.68,936

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.1 /26.9

జిల్లాలో గురువారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. బుధవారం గాలిలో తేమ 61 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ప్రిన్సిపల్స్‌తో సమావేశం నేడు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక డీకేడబ్ల్యూలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో కళాశాలల యూడైస్ ప్లస్ డేటా, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా కళాశాలల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయడం, 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రథమ సంవత్సరంలో ప్రవేశ పెడుతున్న సంస్కరణలు, అడ్మిషన్లు, అకడమిక్ షెడ్యూళ్లను అమలు చేయడం తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని కళాశాలల ప్రిన్సిపల్స్ పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలన్నారు.

డీసీపల్లిలో 405 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం 405 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 472 బేళ్లు రాగా వాటిలో 405 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 53285.5 కిలోల పొగాకును విక్రయించగా రూ.1,39,64,286 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.230లుగా లభించింది. సగటున రూ.262.07 ధర నమోదైంది. వేలంలో 11 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 లభించింది. జనరల్ క్లస్టర్ రైతులు 267 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకు రాగా 214 పొగాకు బేళ్లను కొనుగోలు చేయగా వివిధ కారణాలతో 53 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి వి.మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.230, సగటున కిలోకు రూ.258.89 ధర లభించిందన్నారు. వేలంలో 10 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

మున్సిపాలిటీల్లో పార్కుల అభివృద్ధి

• మంత్రి నారాయణ



నెల్లూరు సిటీ: గ్రీన్ కార్పొరేషన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో పార్కులను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని కలెక్టరేట్ ఎదురుగా ఆధునికీకరించిన మహబూబ్‌ఖాన్ పార్కును బుధవారం నారాయణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 23 నుంచి విద్యార్థులకు వేసవి సెలవులు ఉన్న నేపథ్యంలో ఆ లోపుగా నగరంలోని అన్ని పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న మంచి నీటి వసతి సౌకర్యం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను రూ.165 కోట్ల నిధులతో ఆరు నెలల లోపు పూర్తి చేస్తామన్నారు. ఉయ్యాల కాలువ, జాఫర్‌సాహెబ్ కాలువలకు ఇరువైపులా గోడలు నిర్మించి, స్లాబ్ వేసేందుకు రూ.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అనంతరం వీఆర్ హైస్కూల్ ఆధునికీకరణ పనులు మంత్రి నారాయణ పరిశీలించారు. వీఆర్ హైస్కూల్‌ను ఆధునిక హంగులతో అభివృద్ధి చేసి రాబోవు విద్యా సంవత్సరంలో ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్, అదనపు కమిషనర్ నందన్, హెల్త్ ఆఫీసర్ చైతన్య, మాజీ మున్సిపల్ చైర్మన్ తాళ్లపాక అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని జింక మృతి

వెంకటాచలం: గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందిన ఘటన మండలంలోని సరస్వతీనగర్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. దాహార్తి కోసం రోడ్డు దాటుతున్న జింకను గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే జింక మృతి చెందింది. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

ఇద్దరు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 8,464 మంది విద్యార్థులకు 7,940 మంది హాజరు కాగా 524 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. నెల్లూరు నగరంలోని వివేకనందా, జెనెక్స్ డిగ్రీ కళాశాలలకు చెందిన ఒక్కో విద్యార్థి డిబార్ అయ్యారని వివరించారు.


తగ్గేదేలే.. ఆపేదేలే

జిల్లాను కుళ్లిన చికెన్ వ్యర్థాలు ముంచెత్తుతున్నాయి. ప్రధానంగా కోవూరు, ఆత్మకూరు నియోజకవర్గాల్లో సాగులో ఉండే చేపలకు ఆహారంగా వేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. అధికార పార్టీ నేతలు మాఫియాగా తయారై నిత్యం పదుల సంఖ్యలో వాహనాల్లో వ్యర్థాలను తరలిస్తున్నారు. అడ్డుకోవాల్సిన పోలీసులు మాఫియా ఇచ్చే మామూళ్లు తీసుకుంటూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పత్రికల్లో కథనాలు వస్తే.. ఒకటీ.. రెండు వాహనాలను పట్టుకుని కొంత మేరకు పూడ్చి పెట్టినట్లు షో చేస్తూ మిగతా సరుకును వదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- ఆదివారం రాత్రి అయితే జిల్లాకు 50 పైగా వాహనాలు
- నెలకు రూ.10 కోట్ల వ్యాపారం
- టీడీపీ నేతలకు, ఖాకీలకు కాసులు
- చేపలకు ఆహారంగా వినియోగిస్తున్న వైనం
- వాహనం దొరికినా వదిలేస్తున్న పోలీసులు
- వ్యర్థాలు కలిసిన నీరును పెన్నాలోకి వదిలేస్తున్న వైనం

జిల్లాకు భారీగా డంప్ అవుతున్న చికెన్ వ్యర్థాలు

'ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల సందర్భంగా పాలు కల్తీ, చేపల చెరువుల్లో మేతగా వేసే చికెన్ వ్యర్థాల వినియోగంతో ప్రజారోగ్యం దెబ్బతింటుందని సభ్యులు ప్రస్తావన తేవడంతో స్వయంగా అసెంబ్లీ స్పీకర్ మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు.' అసెంబ్లీ సాక్షిగా స్పీకర్ ఆదేశించినా జిల్లాలో మాత్రం కోళ్ల వ్యర్థాల మాఫియా మాత్రం తగ్గేదేలే అంటోంది. స్థానిక పోలీస్ అధికారుల సహకారంతో రెచ్చిపోతోంది.



మినీ ట్రక్ వాహనాల్లో డ్రమ్ముల్లో తెస్తున్న కుళ్లిన చికెన్ వ్యర్థాలు





చేపల గుంతల్లో నేరుగా వాహనం నుంచి చికెన్ వ్యర్థాలను కుమ్మరిస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అధికార యంత్రాంగం అవినీతి, అధికార పార్టీ అక్రమార్జనకు పచ్చని పల్లెసీమల వాతావరణం కోళ్ల వ్యర్థాలతో డంపింగ్ యార్డుగా మారుతోంది. పక్క రాష్ట్రాల్లో పారేసే చికెన్ వేస్ట్‌తో వ్యాపారం చేసేందుకు కొందరు మాఫియాగా ఏర్పడి పోలీసులు, మత్స్యశాఖ అధికారులకు నెలకు రూ.లక్షల్లో మామూళ్లు అందజేస్తూ విచ్చలవిడిగా తరలిస్తున్నారు. జిల్లాలో సంగం, కోవూరు, ఇందుకూరుపేట, విడవలూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, బుచ్చిరెడ్డిపాళెం ప్రాంతాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో చేపల పెంపకం జరుగుతోంది. అయితే చేపలకు వినియోగించే ఫీడ్ (ఆహారం) ఖరీదు కావడంతో వీటి పోషణ రైతులకు భారంగా మారింది. దీంతో కోళ్ల మేతగా బ్రాండెడ్ ఫీడ్‌కు బదులు, ప్రత్యామ్నాయంగా అతి తక్కువ ఖర్చుతో కూడిన కోళ్ల వ్యర్థాలను చేపలకు ఆహారంగా వినియోగిస్తున్నారు. వీటితో నాలుగు నెలలకే కేజీ, అంతకు మించిన బరువు పెరుగుతున్నాయి. దీంతో జిల్లాలో దాదాపు 80 శాతం మంది చేపల రైతులు కోళ్ల వ్యర్థాలనే వినియోగిస్తున్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక ప్రాంతాల నుంచి కోళ్ల వ్యర్థాలు జిల్లాకు తెచ్చి విక్రయించే మాఫియా తయారైంది.

ఇతర రాష్ట్రాల్లో డంపింగ్ యార్డులు

బెంగళూరు, చెన్నై, కేరళ ప్రాంతాల్లో ఈ మాఫియా కోళ్ల వ్యర్థాల సేకరణ కోసం డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసుకుంది. స్థానికంగా కొందరిని చేరదీసి వారి ద్వారా నిత్యం వ్యర్థాల సేకరణ చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రి వేళల్లో లోడింగ్ చేసి నెల్లూరుకు చేరుస్తారు. రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులు, పోలీసులు, మత్స్యశాఖ అధికారులకు నెలవారీ మామూళ్లు పంపిస్తారు. ఎవరూ కూడా ఆ వాహనాలను చెక్ చేయరు.

నిత్యం వంద టన్నులపైనే డంప్

తమిళనాడు, కేరళ, కర్ణాటక ప్రాంతాల నుంచి నిత్యం సుమారు వంద టన్నులకు పైగా కోళ్ల వ్యర్థాలు రవాణా జరుగుతున్నట్లు సమాచారం. రాత్రి పూట బయలుదేరి తెల్లవారే సరికే చేపల గుంతల వద్దకు ఈ వాహనాలు చేరుకుంటున్నాయి. వీటిని వేగంగా రవాణా చేసేందుకు డీసీఎంఎస్ వాహనాలను వినియోగిస్తున్నారు. పెద్దవి అయితే ఒకదానిపై ఒకటి లెక్కన రెండు.. చిన్నవి అయితే మూడు పట్టే విధంగా ఈ వాహనాల బాడీలను ఎత్తుగా డిజైన్ చేసుకుంటున్నారు. తమిళనాడు నుంచి 15 నుంచి నుంచి 20 వాహనాలు, కేరళ నుంచి 10 వరకు, కర్ణాటక నుంచి 10 నుంచి 15 వాహనాలు నిత్యం రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఒక్కొక్క వాహనంలో 20 టన్నుల నుంచి 30 టన్నుల వరకు తరలిస్తున్నారు. రోజు వారీగా కంటే ఆదివారం రోజుల్లోనే దాదాపు 50 పైగా వాహనాలు తరలిస్తాయని స్థానికులు చెబుతున్నారు.

అక్కడ నిషేధం.. ఇక్కడ చేపలకు ఆహారం

కోళ్ల వ్యర్థాలను చేపలకు, రొయ్యలకు ఆహారం వేయడాన్ని నిషేధిస్తూ కేంద్రం రెండేళ్ల క్రితం అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు ధిక్కరించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించినప్పటికీ అనే రాష్ట్రాల్లో అమలు కావడం లేదు. దీనిపై ఇటీవల కేంద్ర ప్రభుత్వం సైతం సీరియస్ అయి ఆయా రాష్ట్రాల డీజీపీలు, సీఎస్‌లకు చర్యలకు ఉపక్రమించాలని స్పష్టం చేస్తూ లేఖలు రాసింది. కేంద్రం ఆదేశాలతో పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్ణాటక కోళ్ల వ్యర్థాలను నిషేధించగా, ఆ వ్యర్థాలను మన రాష్ట్రంలోని ప్రధానంగా జిల్లాకు నిత్యం టన్నుల కొద్దీ డంప్ చేస్తున్నారు.

నెలకు రూ.లక్షల్లో మామూళ్లు

ఈ వాహనాలు టోల్‌గేట్లు దాటుకుని జిల్లాలోకి వస్తున్నప్పుడు కట్టడి చేసే అవకాశం ఇటు పోలీసులకు, అటు మత్స్యశాఖ అధికారులు పెద్ద కష్టమేమి కాదు. వీటిని గుర్తించి కట్టడి చేసే అవకాశం ఉన్నప్పటికీ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పోలీస్ శాఖకు ఒక్కో వాహనానికి రూ.10 వేలు వంతున నెలవారీ మామూళ్లు ముట్టజెప్పుతారు. అంటే నెలకు వంద వాహనాలు తిరిగితే నెలకు ఒక్కో స్టేషన్‌కు రూ.10 లక్షలు ఇస్తున్నట్లు సమాచారం. సర్కిల్, డీఎస్పీ స్థాయి అధికారికి, మత్స్యశాఖాధికారికి ప్రత్యేకంగా మామూళ్లు ఇస్తారనే ఆరోపణలున్నాయి. దీంతో ఏ అధికారి ఆ వాహనాల జోలికి వెళ్లడం లేదు. అడపాదడపా రోడ్డు ప్రమాదాలు, వాహనం మరమ్మతులకు గురైతే మాత్రం వ్యర్థాల రవాణా వెలుగులోకి వస్తోంది. ఒక వేళ వ్యర్థాల వాహనాలను పట్టించినా వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల సంగంలో వాహనాన్ని స్థానికులు పట్టించినా పోలీసులు వదిలేయడం వెనుక భారీగానే ముట్టియనే సమాచారం.

ఆదాయం రూ.కోట్లల్లోనే..

ఇతర రాష్ట్రాల్లో చికెన్ వ్యర్థాలను కేజీ రూ.5 వంతున సేకరిస్తారు. స్థానిక డంపింగ్, రవాణా, అధికారుల మామూళ్ల కోసం కేజీకి మరో రూ.5 ఖర్చవుతుంది. కేజీ రూ.10 వంతున జిల్లాకు చేరుకుంటుంది. చేపల చెరువు యజమానులకు కేజీ రూ.25 నుంచి రూ.30 వరకు విక్రయిస్తారు. ఈ లెక్కన నెలకు రూ.10 కోట్ల వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం. ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం, కోవూరు ప్రాంతాల్లో ఈ మాఫియాకు నెలకు రూ.కోట్లలో ఆదాయం వస్తుండడంతో అందరూ ఆ వ్యాపారం పైనే దృష్టి పెడుతున్నారు. అధికార పార్టీ నేతలకు భారీగానే మాఫియా ముట్టజెప్పుతుండడంతో ఈ మాఫియాకు అడ్డేలేదు.

సంగం నేతలకు రూ.50 లక్షలు?

సంగం మండలంలో వంగల్లు, పడమటపాళెం, కోలగట్ల, దువ్వూరుల్లో దాదాపు 400 ఎకరాల్లో చేపల చెరువులు ఉన్నాయి. కోవూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి మాఫియాను నడుపుతున్నాడు. కేవలం సంగంకు చెందిన టీడీపీ నేతలకు నెలకు రూ.50 లక్షల వరకు ముట్టజెప్పుతున్నాడనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఈ వసూళ్ల పర్వంలో నేతల మధ్య విభేదాలు రావడంతో వసూళ్ల పర్వం వెలుగులోకి వచ్చింది. ఇందులో పోలీసులు కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.

పెన్నా నదిలోకి వదిలేస్తూ..

సంగం, కోవూరు నియోజకవర్గ ప్రాంతాల్లో పెన్నానది పరీవాహక ప్రాంతాల్లోనే చేపల పెంపకం చేస్తున్నారు. చికెన్ వ్యర్థాల కలిసిన నీరును గుంతల నుంచి తిరిగి పెన్నాలోకి వదిలేస్తుండడంతో పెన్నా నీరు కలుషితమవుతోంది. తద్వారా జిల్లాలోని పలు ప్రాంతాల్లో పెన్నానీరే తాగుతున్నారు. కలుషిత నీరు సేవించడం వల్ల ప్రజారోగ్యం దెబ్బతిని అనారోగ్యం పాలవుతున్నారని ప్రజారోగ్యశాఖ అధికారులు చెపుతున్నారు.

పెండింగ్ బిల్లులు సిద్ధం చేయండి

• కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలో డ్వామా, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి పెండింగ్ బిల్లుల వివరాలు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. 2017–18, 2018–19 సంవత్సరాల కాలంలో డ్వామా ఆధ్వర్యంలో చేపట్టిన ఉపాధి హామీ, ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు కాంక్రీట్ పనులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు, అప్‌లోడ్‌లో సాంకేతిక సమస్యలపై కలెక్టర్ చర్చించారు. ఈ శాఖలకు సంబంధించి గతంలో చేపట్టిన పనులు, రివైజ్ ఎస్టిమేట్లు, పెండింగ్ బిల్లుల పూర్తి సమాచారాన్ని అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో రూ.38 కోట్ల నీటి తీరువా పన్నుల బకాయిలు ఉన్నాయని, సాగునీటి కాలువల పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్లు రైతులకు అవగాహన కల్పించి పన్నులు చెల్లించేలా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్, సోమశిల ఎస్ఈ వెంకటరమణ, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్, డ్వామా పీడీ గంగాభవాని, ఈఈలు నాగరాజు, మల్లికార్జున, ఐ శ్రీనివాసరావు, కె శ్రీనివాసరావు, డీఐ కె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో 'విధులు' లొల్లి

నెల్లూరు సిటీ: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సెలవు దినాల్లో కూడా విధులు నిర్వహించాలని చెప్పడంపై ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో వరుసగా మూడు రోజుల పాటు సెలవులు ఉండడంతో కొందరు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల దర్శనానికి టికెట్లు బుకింగ్, హైదరాబాద్‌లోని బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే బుధవారం రిజిస్ట్రేషన్ శాఖలోని ఓ ఉన్నతాధికారి ఆ శాఖ వాట్సాప్ గ్రూప్‌లో ఉద్యోగులు, సిబ్బంది అందరూ 12వ తేదీ విధులకు రావాల్సి ఉంటుందని మెసేజ్ చేశారు. దీంతో ఉద్యోగులు సెలవుల నేపథ్యంలో తాము ముందుగా చేసుకున్న ప్రయాణాలు నిలిపివేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో కూడా..

మార్చి 8వ తేదీన మహిళా దినోత్సవం రోజు కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కార్యకలాపాలు నిర్వహించారు. మార్చి 30 ఉగాది, 31 రంజాన్ పండగ దినాల్లో కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఉద్యోగులు పని చేశారు. ఆర్థిక సంవత్సరం కాబట్టి కార్యకలాపాలు జరిపారని, అయితే ఏప్రిల్ 12వ తేదీ కూడా పనిచేయాలని అధికారులు ఆదేశించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇతర డిపార్ట్‌మెంట్‌ల్లో లేని నూతన విధానాన్ని రిజిస్ట్రేషన్ శాఖలో మాత్రమే అమలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచండి

నెల్లూరు (పొగతోట): ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారిణి పి.సత్యవాణి అధికారులను ఆదేశించారు. బుధవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో విత్తన విక్రేతలు, హోల్‌సేల్ ఎరువుల డీలర్లు, కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని సోమశిల ప్రాజెక్ట్‌లో 56 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ఖరీఫ్‌లో వరి సాగుకు సంబంధించి కేఎన్ఎం 1638, ఎన్ఎల్ఆర్ 34449, కేఎన్ఎం 733, ఎన్ఎల్ఆర్ 3354 తదితర రకాలకు సంబంధించిన వరి విత్తనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఎంఆర్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సహాయ వ్యవసాయ సంచాలకులు నర్సోజీరావు, శేషగిరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నోషనల్ ఖాతాలను మార్చేందుకు ప్రత్యేక చర్యలు

నెల్లూరు రూరల్: జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో రైతుల భూములకు సంబంధించి రికార్డుల్లో నోషనల్ ఖాతాలుగా నమోదై, వివాదాలు లేని పట్టా భూములను రెగ్యులర్ ఖాతాగా మార్చేందుకు ఈ నెల 16వ తేదీ వరకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు డీఆర్వో ఉదయభాస్కర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాదారులు ఎవరైనా తమ భూములకు నోషనల్ ఖాతా నమోదైనట్లు ఉంటే వారు తగిన రికార్డులతో సంబంధిత తహసీల్దారు, ఆర్డీఓకు సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీవారి వసంతోత్సవాలకు అంకురార్పణ



పెంచలకోనలో వసంతోత్సవాలకు అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో కొలువైన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి వసంతోత్సవాలకు బుధవారం రాత్రి వేదపండితులు అంకురార్పణ చేశారు. శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. దేవస్థాన ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి మాట్లాడుతూ స్వామి వారికి వేసవి తాపాన్ని తగ్గించేందుకు చైత్ర మాసం వసంత రుతువులో స్వామివారికి వసంతోత్సవాలు నిర్వహించడం ఆచారమన్నారు. శ్రీవారి వసంతోత్సవాలు విజయవంతమయ్యేందుకు వేదపండితులు నందనవనంలోని పుట్టమట్టిని తీసుకువచ్చి అందులో నవధాన్యాలు కలిపి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం అనుజ్ఞ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మత్సంగ్రహణం, అంకురార్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అంకురార్పణ కార్యక్రమాన్ని తిలకించేదుకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటితో పది జవాబుపత్రాల మూల్యాంకనం ముగింపు

నెల్లూరు (టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనం గురువారంతో ముగియనుంది. గత నెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన పది పరీక్షలు 31వ తేదీతో ముగిశాయి. ఈ పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 3 నుంచి ప్రారంభించి 9వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే సోషల్ సబ్జెక్ట్‌కు సంబంధించి జవాబు పత్రాలు జిల్లాకు ఆలస్యంగా వచ్చాయి. దీంతో పది మూల్యాంకనం గురువారం మధ్యాహ్నానికి పూర్తి చేయనున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన 1,92,920 జవాబు పత్రాలను మూల్యాకనం చేశారు. మూల్యాకనంలో 1,076 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 174 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 348 మంది స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు. పది ఫలితాలను ఈ నెల 15వ తేదీలోపు విడుదల చేసేందుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖాధికారులు చర్యలు ప్రారంభించారు.

సిబ్బంది కేటాయింపు.. కానీ తాత్కాలికమే..

రైళ్లల్లో సాయుధ గస్తీ
- జిల్లా పోలీస్ శాఖ నుంచి 33 మంది
- దొంగతనాలు జరిగే అవకాశమున్న ప్రాంతాల్లో పికెట్లు
- నేరస్తులను కాల్చేందుకు వెనుకాడొద్దని ఆదేశాలు



నెల్లూరు ప్రధాన స్టేషన్‌లో రైల్వే పోలీసులు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు సబ్ డివిజన్‌లో రైల్వే పోలీస్ సిబ్బంది కొరత వెంటాడుతోంది. 151 మందికి గానూ 60 శాతం మంది మాత్రమే ఉన్నారు. దీంతో ఉన్నవారిపై పనిభారం పెరిగింది. నేర నియంత్రణ, కేసుల పరిష్కారం వారికి తలకు మించిన భారంగా మారుతోంది. దీంతో ప్రయాణికుల భద్రతపై దృష్టిసారించలేకపోతున్నారు. బీట్ వ్యవస్థ నామమాత్రంగా మారింది. ఇది నేరగాళ్లకు కలిసొస్తోంది. ఇటీవల అంతర్రాష్ట్ర ముఠా సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి దోపిడీకి పాల్పడింది. దీనికితోడు వేసవిలో రైళ్లల్లో దోపిడీలు, దొంగతనాలు అధికంగా జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

చర్యలిలా..

సిబ్బంది కొరతను అధిగమించేందుకు రైల్వే పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. వేసవి ముగిసేంత వరకూ తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బందిని కేటాయించాలని ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను కోరారు. దీంతో జిల్లా పోలీస్ శాఖ నుంచి 33 మంది సిబ్బందిని కేటాయించారు. అందులో 20 మంది రైల్వే డీఎస్పీ వద్ద ఇప్పటికే రిపోర్ట్ చేశారు. మరో 13 మంది నేడో, రేపో రిపోర్ట్ చేయనున్నారు. వేసవి నేపథ్యంలో రైల్వే ప్లాట్‌ఫాంలపై నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టం ద్వారా ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నారు. రాత్రి వేళల్లో జిల్లా మీదుగా రాకపోకలు సాగించే అన్ని రైళ్లల్లో సాయుధ పోలీసులతో బీట్‌లను ఏర్పాటు చేశారు. ప్రయాణికుల భద్రత దష్ట్యా బీట్ సిబ్బంది వద్ద ఉన్న పుస్తకంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారుల ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచారు. ఏదైనా నేరం జరిగిన వెంటనే ప్రయాణికులు ఉన్నతాధికారులకు, రైల్వే, స్థానిక పోలీసులకు సమాచారం చేరవేసేలా చర్యలు చేపట్టారు. దొంగతనాలు జరిగే అవకాశమున్న ప్రాంతాల్లో పికెట్లను ఏర్పాటు చేస్తున్నారు.

20 బీట్లు

గతంలో పది బీట్లు ఉండగా వాటిని 20కు పెంచారు. రాత్రి 8 నుంచి ఉదయం 6 గంటల వరకు జిల్లా మీదుగా రాకపోకలు సాగించే రైళ్లల్లో గస్తీని పెంచారు. ఒక్కో బీట్‌లో ఇద్దరు కానిస్టేబుల్స్ ఉంటున్నారు. ఒక కానిస్టేబుల్ వద్ద తుపాకీ, లాఠీ, రెండు టార్చ్‌లైట్లు, విజిల్స్ ఉంటాయి. వీరు నిందితులను గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయడంతోపాటుగా అదుపులోకి తీసుకుంటారు. నిందితులు ప్రతిఘటిస్తే కాల్చేందుకు వెనుకాడబోరు. క్రైమ్ పార్టీలు రైళ్లల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాయి. వీక్లీ, స్పెషల్ రైళ్లల్లో ఆర్పీఎఫ్ సిబ్బంది బీట్‌లు నిర్వహిస్తున్నారు. ప్లాట్ ఫాంలపై సిబ్బంది పోలీస్ మఫ్టీలో ఉంటున్నారు. వీరు రాత్రి 9 నుంచి ఉదయం 7 గంటల వరకు అక్కడ విధులు నిర్వహిస్తూ నేరాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

నేరాల కట్టడికి చర్యలు

నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్ పర్యవేక్షణలో నేరాల నియంత్రణకు ఆర్పీఎఫ్, స్థానిక పోలీసుల సహకారంతో చర్యలు చేపట్టాం. బీట్ వ్యవస్థను పటిష్టం చేశాం. నేరాలు జరిగే అవకాశమున్న ప్రాంతాల్లో సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నాం. పాతనేరస్తులు, అంతర్రాష్ట్ర ముఠాల కదలికలపై నిఘా పెంచాం. అన్ని రైళ్లు, రైల్వేస్టేషన్లలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. దొంగలు కనిపిస్తే కాల్చేయమని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నాయి. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి. నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలకు సహకరించాలి. – **ఎ.సుధాకర్, నెల్లూరు రైల్వే సీఐ**

నిరంతర గస్తీ

సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ/ఎస్సైలు తమ సిబ్బందితో కలిసి రోజు రాత్రి ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నారు. మరోవైపు పాతనేరస్తులు, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన ముఠాలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెంచారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే ఫిన్స్ (ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ నెట్‌వర్క్ సిస్టం) డివైజ్ ద్వారా వేలిముద్రలను సేకరించి డేటాబేస్ ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. జైల్ మానిటరింగ్ వ్యవస్థను పటిష్టం చేశారు. ఉమ్మడి జిల్లాలోని తెట్టు, వెంకటేశ్వరపురం, అల్లూరు రోడ్డు, తలమంచి, కొడవలూరు, పడుగుపాడు, మనుబోలు, గూడూరు ఔటర్లలో నేరాలు అధికంగా జరిగే అవకాశం ఉండటంతో పికెట్లను ఏర్పాటు చేస్తి నిశిత నిఘా పెడుతున్నారు. అన్ని రైల్వేస్టేషన్లను సీసీ కెమెరాల నిఘా నీడలోకి తీసుకొస్తున్నారు. నిరంతర గస్తీ, సాంకేతికత ఆధారంగా నేరాలను పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు రైల్వే పోలీసులు చర్యలు తీసుకున్నారు.



తనిఖీలు చేస్తున్న రైల్వే పోలీసులు

నెల్లూరులో శాంతి ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు తదితరులు

నెల్లూరు రూరల్: జిల్లాలోని అన్ని క్రైస్తవ సంఘాలు బుధవారం నెల్లూరులోని భారీ శాంతి ర్యాలీ నిర్వహించాయి. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి వారి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఏబీఎస్ కాంపౌండ్ నుంచి వీఆర్సీ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నేతలు మాట్లాడుతూ దేశ శాంతి భద్రతల కోసం నిరంతరం ప్రార్థిస్తుంటామన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవుల ఐక్యత వర్ధిల్లాలని, మత సామరస్యం తీసుకురావాలని నినాదాలు చేశారు.

కండలేరులో 47.372 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 47.372 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,320, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నిమ్మధరలు (కిలో)	
పెద్దవి	రూ.110
సన్నవి	రూ.90
పండ్లు	రూ.60



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	100	బ్రాయిలర్ స్కిన్‌లెస్	204
లేయర్ (లైవ్)	100		
బ్రాయిలర్ చికెన్	184	లేయర్ చికెన్	170

పెన్నానదిలో దూకి వివాహిత ఆత్మహత్య



ఘటనా స్థలంలో మృతదేహం

నెల్లూరు(క్రైమ్): పెన్నానదిలో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరులోని పెన్నా బ్యారేజ్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. రంగనాయకులపేట ముస్లింవీధికి చెందిన సల్మా (38)కు నాలుగో మైలుకు చెందిన అఫ్జల్‌తో వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు సంతానం. సల్మాకు కొంతకాలంగా మతిస్థిమితం సరిగ్గా లేదు. ఈ నేపథ్యంలో బుధవారం ఆమె రంగనాయకులపేటలోని తల్లిదండ్రుల ఇంటి కొచ్చింది. వారు లేకపోవడంతో వెనుదిరిగింది. బ్యారేజ్ వద్దకు చేరుకుని పెన్నానదిలో దూకింది. గమనించిన స్థానికులు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో సల్మా కోసం గాలించారు. కొద్దిసేపటికి ఆమె మృతదేహం బయట పడింది. ఇంతలో విషయం తెలుసుకున్న సల్మా తండ్రి, భర్త అక్కడికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నమ్మించి.. రూ.2.58 లక్షలు కాజేసి..

- సైబర్ మోసంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): నగదు డిపాజిట్ చేస్తే అధిక లాభాలు, ప్రయోజనాలుంటాయని నమ్మించి ఓ యువతి వద్ద రూ.2.58 లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నగరానికి చెందిన సాయి జ్యోత్స్న ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌కు గతనెల 20వ తేదీన సేవింగ్స్, ఆన్‌లైన్ మార్కెటింగ్ పేరిట లింక్ వచ్చింది. దానిపై ఆమె క్లిక్ చేయగా వాట్సాప్ నంబర్‌కు నితేష్ అనే వ్యక్తి మెసేజ్ చేశాడు. తాను డాటాబాక్స్ బిజినెస్.కామ్ కంపెనీకి చెందిన ప్రతినిధినని, ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై సలహాలిస్తూ అధిక లాభాలు వచ్చేలా చేస్తానని చెప్పాడు. అనంతరం నితిన్ టెలిగ్రామ్ గ్రూప్‌లో ఆమెను యాడ్ చేసి కంపెనీలో అకౌంట్ ఓపెన్ చేశాడు. ఆ సమయంలో యువతి బ్యాంక్ వివరాలు సేకరించాడు. అనంతరం ఆమెను నమ్మించేందుకు కంపెనీ ప్రొడక్ట్ ఫీడ్‌బ్యాక్ చేయించి రూ.14,375ల నగదును ఖాతాలో జమ చేశాడు. దీంతో ఆమెకు నితిన్‌పై నమ్మకం పెరిగింది. ఆ తర్వాత నిందితుడు కంపెనీలో పెద్ద మొత్తంలో డబ్బులు డిపాజిట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని చెప్పడంతో జ్యోత్స్న మూడు దఫాలుగా రూ.2,58,096ల నగదును డిపాజిట్ చేసింది. అనంతరం ఆమె తన అకౌంట్‌ను పరిశీలించగా పెద్దమొత్తంలో నగదు ఉన్నట్లు చూపించింది. ఆ నగదు డ్రా చేసేందుకు యత్నించగా పెండింగ్ అని చూపించింది. దీంతో ఆమె కంపెనీ కస్టమర్ సపోర్ట్ ప్రతినిధులతో చాట్ చేయగా కమీషన్ కింద కొంత మొత్తం డిపాజిట్ చేస్తే అకౌంట్‌లోని మొత్తం నగదును డ్రా చేసుకోవచ్చని వారు సూచించారు. దీంతో అనుమానం వచ్చిన బాధితురాలు ఈనెల ఒకటో తేదీన ఎన్‌సీఆర్పీ పోర్టల్లో ఫిర్యాదు చేసింది. తదుపరి విచారణ నిమిత్తం బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేతలు వేధిస్తున్నారు

- సజ్జలకు వివరించిన రవీంద్రారెడ్డి



సజ్జలతో రవీంద్రారెడ్డి

సోమశిల: టీడీపీ నేతలు అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని అనంతసాగరం మండల పరిధిలోని రేవూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయిళ్ల రవీంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని రవీంద్రారెడ్డి బుధవారం కలిశారు. ఏదో ఒక కారణంతో అక్రమ కేసులు పెడుతున్నారని, బెదిరింపులకు గురి చేస్తున్నారని రవీంద్రారెడ్డి చెప్పారు. ఈ విషయాలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని సజ్జల భరోసా ఇచ్చారు.